క్లుప్తంగా

పేదింటి బిడ్డలకు కల్యాణలక్ష్మి వరం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: రాష్ట్రంలో పేదింటి అమ్మాయిల వివాహాలకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం వరంలా మారాయని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని విలాసాగర్, మర్లపేట గ్రామాల్లో 13 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.13,01,508 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ ముదుగంటి సురేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్‌చైర్మన్ చిక్కాల సుధాకర్‌రావు, సర్పంచులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు వినీల


వినీలతో పాఠశాల ఉపాధ్యాయుల బృందం

గంభీరావుపేట: ఈ నెల 27 నుంచి 31 వరకు కేరళలోని త్రిశూర్‌లో నిర్వహించనున్న దక్షిణ భారత జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పొన్నాల వినీల ఎంపికైంది. ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వినీల ప్రదర్శన జాతీయస్థాయికి ఎంపికై ంది. వినీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయన్నగారి నారాయణ, విద్యా కమిటీ చైర్మన్ చంద్రమౌళి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ ఇళ్లు

ఎల్లారెడ్డిపేట: మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్లు లేని అర్హులందరిని గుర్తించే ప్రక్రియ పూర్తయిందని, తొందరలోనే వారందరికి ఇండ్లు కట్టిస్తామని ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని అక్కపల్లిలో బుధవారం ఎంపిక చేసిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలు ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంత్‌కుమార్, సర్పంచ్ మధుకర్, వైస్‌ఎంపీపీ భాస్కర్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మట్టి రోడ్లకు మహర్దశ .?

- బీటీ రోడ్ల పనులకు వీడని గ్రహణం
- ప్రతిపాదనలకే పరిమితం
- గ్రామీణుల మట్టి రోడ్డు కష్టాలు


తెర్లుమద్ది నుంచి రాగంపల్లెకు వెళ్లే మట్టి రోడ్డు

ముస్తాబాద్: మట్టి రోడ్లకు మహర్దశ పట్టేదెప్పుడో.. పల్లె ప్రజల రోడ్డు కష్టాలు తీరేదెప్పుడో.. బీటీ రోడ్డుగా మార్చేందుకు ఏళ్లుగా చేస్తున్న ప్రతిపాదనలకు ఆమోదం లభించడం లేదు. ఈసారైన కొత్త బడ్జెట్‌లో మట్టి రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలో మట్టి రోడ్డు కష్టాలు తొలగించేందుకు సర్పంచులు ప్రతి సంవత్సరం ప్రతిపాదనలు పంపిస్తున్నారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపడం. వాటికి నిధులు మంజూరు కాకపోవడం రివాజుగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని చాలా గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నప్పటికీ, మారుమూల పల్లెలను కలుపుతూ వేసే లింకు రోడ్లకు నిధులు కోరుతున్నారు.

మండలంలో మట్టి రోడ్లు ఇవీ

8 ఏళ్లుగా మండలంలోని 22 గ్రామాలకు బీటీ రోడ్డు పనులను మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో చేయించారు. అయితే మారుమూల పల్లెలకు రహదారులు వేయాల్సి వుంది. రైతులకు రోడ్డు కష్టాలు తీర్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ప్రతిపాదనలు చేస్తున్నారు. పోతుగల్ నుంచి తెర్లుమద్దికి వెళ్లే బండ్లబాటను బీటీ రోడ్డుగా మార్చాల్సి వుంది. అలాగే తెర్లుమద్ది ప్రధాన రహదారి నుంచి రాగంపల్లెకు వెళ్లే రహదారి 2 కిలోమీటర్ల మేరకు బీటీని వేసి వదిలేశారు. ఏడేళ్లుగా ఇంకో కిలోమీటర్ రోడ్డును అలాగే వదిలేశారు. దీంతో తండావాసులు వానకాలంలో ఇబ్బంది పడుతున్నారు. ఆవునూర్ గ్రామం నుంచి కొదాటివానిపల్లెకు వెళ్లే రహదారి బాగాలేదు. రైతులు ఈ దారిలో వెళ్లేందుకు తంటాలు పడుతున్నారు. ట్రాక్టర్లు దిగపడుతున్నాయి. నామాపూర్ నుంచి గోపాల్‌పల్లె మట్టిరోడ్డుతో ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిప్పలపల్లి నుంచి బండలింగంపల్లెకు వెళ్లే రహదారిని ఐదేళ్ల క్రితం డబుల్ రోడ్డుగా విస్తరించారు. అయితే నిధులు సరిపోలేదని కిలోమీటర్ పనులను అలాగే వదిలేశారు. బందనకల్ నుంచి వెంకట్రావుపల్లె మట్టి రోడ్డును బాగుచేయాల్సివుంది. మోహినికుంట నుంచి ఆశ్రమం వరకు మట్టి రోడ్డు వుంది. మద్దికుంట నుంచి రేకులకుంట ఎల్లమ్మ, మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్లే మట్టి రోడ్డుతో భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి నిత్యం ఇక్కడికి వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారి వాహనాలు వానకాలంలో ఇబ్బందితో ఆలయానికి చేరుకుంటాయి. అలాగే చీకొడు నుంచి రేకులకుంటకు వేళ్లే మరో మట్టి రోడ్డు అలాగే ఉంది. గూడెం నుంచి పోతుగల్‌కు వెళ్లే మట్టి రోడ్డుతో రైతులు అవస్థలు పడుతున్నారు. ట్రాక్టర్లు, హార్వేస్టర్లు వెళ్లేందుకు కష్టంగా ఉందని రైతులంటున్నారు.3బీ

వానకాలం మట్టి రోడ్డు కష్టాలు

వానకాలంలో మట్టిరోడ్లపై రైతులు నానాతంటాలు పడుతున్నారు. మట్టి రోడ్డంతా బురదమయంగా మారడమే కాకుండా, వాహనాలు ముందుకు నడవలేని పరిస్థితి ఉందని అంటున్నారు. మట్టి రోడ్లపై ఏర్పడ్డ గుంతలతో వాహనాలు బురదలో కురుకుపోతున్నాయి. హార్వేస్టర్లు, ట్రాక్టర్లు నడిచేందుకు ఇబ్బందిగా ఉంది. వరి పంటల కోత దశలో హార్వేస్టర్లు ముందుకు వెళ్లడం లేదంటున్నారు. ద్విచక్ర వాహనాలు కూడా నడవని పరిస్థితి నెలకొంది. వానకాలం అనంతరం మట్టి రోడ్డు గుంతలమయంగా మారుతున్నాయి. వీటి ద్వారా మరింత ఇబ్బందిగా ఉంటుందని అన్నదాతలు అంటున్నారు.

కష్టాలు తీర్చాలి



పంట పొలాలకు వేళ్లే మట్టి రోడ్లను బీటీగా మార్చాలి. బైక్‌పై కూడా పొలాలకు వెళ్లలేని పరిస్థితి వుంది. రైతులు బండ్లబాటతో ఇబ్బంది పడుతున్నారు. గోపాల్‌పల్లె, నామాపూర్ మట్టి రోడ్డును పూర్తి చేయాలి. అధికారుల ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయాలి.

– కొండం రాజిరెడ్డి, నామాపూర్

రేకులకుంటకు రోడ్డు వేయాలి



చీకొడు మీదుగా రేకులకుంట ఆలయానికి వెళ్లే భక్తులకు మట్టి రోడ్డు మాత్రమే ఉంది. హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సరైన రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే తండాకు వెళ్లే మట్టి రోడ్డుకు బీటీ వేయాలి. రైతుల ఇబ్బందులు తొలగించాలి.

– కర్రెడ్ల కొండల్‌రెడ్డి, చీకొడు

ప్రతిపాదనలు పంపించాం



మండలంలో పదికి పైగా బీటీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశాం. పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. మొత్తం పనులకు గతేడాది నిధులు మంజూరు కాలేదు. ఈసారి బడ్జెట్‌లో నిధులు వస్తాయనుకుంటున్నాం. కొన్నింటికి పీఎంజీఎస్‌వై కింద నిధులు వచ్చాయి.

– ఇనాయతుల్లా, ఏఈ

రూ.19 లక్షలపై స్వపక్ష నేతల దుమారం

- ఏకపక్షంగా రద్దు చేస్తూ చేతులెత్తిన వైనం
- చైర్‌పర్సన్ వర్సెస్ కౌన్సిలర్ల వాగ్వాదం



మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ: వేములవాడ మున్సిపాలిటీలో రూ.19 లక్షల నిధులపై దుమారం చెలరేగింది. పాలకవర్గం దృష్టికి తీసుకొని రాకుండా డబ్బులు ఎలా వెచ్చించి తమను ఆమోదం తెలపాలని కోరుతున్నారంటూ స్వపక్ష, విపక్ష నేతలు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిని ప్రశ్నించారు. ఈక్రమంలో చైర్‌పర్సన్, స్వపక్ష కౌన్సిలర్ల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ భర్త రాజు కల్పించుకుని స్వపక్ష సభ్యులను శాంతింపజేశారు. ఈక్రమంలో రూ.19 లక్షల నిధుల అంశం మినహా మిగతా అంశాలకు ఆమోదం తెలిపినట్లు కమిషనర్ అన్వేశ్ ప్రకటించారు. బుధవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో ఎజెండా అంశాలను అధికారులు చదివి వినిపించారు. డీఈ తిరుపతి, ఏఈ నర్సింహస్వామి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో జాతీయ ఓటరు దినోత్సవం



గంభీరావుపేట/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/చందుర్తి/వేములవాడఅర్బన్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. ఉపాధ్యాయ బృందం, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

బోయినపల్లి: మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంజనీరింగ్ విభాగంలో పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల మంజూరుపై ఎమ్మెల్యేకు ప్రతిపాదనలు అందించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, వైస్‌ఎంపీపీ నాగయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు నరేశ్, శ్రీకాంత్‌రెడ్డి, పీఆర్‌డీఈ సత్యనారాయణ, ఏఈ యాదగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలేవీ?

- కమిషనర్‌ను ప్రశ్నించిన బీజేపీ నేతలు
- నల్లకండువాలతో నిరసన

వేములవాడ: భక్తుల ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా సౌకర్యాల కల్పనలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ప్రశ్నించారు. మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన కమిషనర్‌ను కలిసేందుకు వచ్చారు. భక్తుల కష్టాలను వివరించారు. కమిషనర్ ఏదైన సమస్య ఉంటే ఇక్కడే ఈవో ఉంటారు.. అతనికి వినతిపత్రం అందించాలని సూచించారు. దీంతో సంతృప్తి చెందని బీజేపీ నాయకులు నల్లకండువాలు ధరించి ఈవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. నాయకులు కుమ్మరి శంకర్, గోపు బాలరాజు, రేగుల మల్లికార్జున్, సంటి మహేశ్, పిన్నింటి హన్మండ్లు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఇతర నాయకులు

మెగా ఆరోగ్య వైద్య శిబిరానికి స్పందన


మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట: మండలంలోని గజసింగవరంలో మెగా ఆరోగ్య వైద్య శిబిరాన్ని టిస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శిబిరాన్ని ప్రారంభించారు. దాదాపు 350 కుటుంబాల సభ్యులకు ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలరాజు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ నారాయణరావు, పలువురు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎస్పీ


క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సిరిసిల్లఅర్బన్: మెదక్ జిల్లాలో మూడు రోజుల క్రితం జరిగిన 4వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఎస్పీ రాహుల్ హెగ్డే అభినందించారు. జిల్లా నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొనగా ఏడుగురు క్రీడాకారులు బంగారు, వెండి పథకాలు సాధించారు. పతకాలు సాధించిన కానిస్టేబుల్స్ జె.ప్రశాంత్, జె.లక్ష్మణ్‌ను, గొట్టిముక్కల శేఖర్, మాదాసు లక్ష్మణ్, ఎం.లక్ష్మి, రామానుజమ్మను సత్కరించారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని నిలపాలని కోరారు.

విజయవంతంగా మోకాలు కీలుమార్పిడి


వేములవాడ ఆసుపత్రిలో మోకాలు కీలు మార్పిడి పేషెంట్లతో వైద్యులు

- ఒకే రోజు నలుగురికి శస్త్రచికిత్సలు

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో నలుగురికి మోకాలు కీలుమార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తిచేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం వివరాలు వెల్లడించారు. కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన ఇస్లావత్ చంద్రునాయక్, బొమ్మెన గ్రామానికి చెందిన చిన్ననర్సయ్య, మెట్‌పల్లి మండలం ముసాయిపేటకు చెందిన కట్టె పెద్దలక్ష్మి, వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్‌కు చెందిన చిందం విరవ్వలకు మోకాలు కీలుమార్పిడి ఆపరేషన్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు ఏరియా ఆస్పత్రిలో 9 మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. వైద్యులు అనిల్‌కుమార్, సంతోష్‌చారి, వెంకట్, తిరుపతి, స్టాఫ్‌నర్సు భాగ్యలక్ష్మి, కావ్య, అరుణ్‌సాయి, నాగరాజు, తిరుపతి, సంతోష్ ఉన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం


కంటి పరీక్షలు చేసుకుంటున్న ఎంపీపీ మానస

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర, తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లెలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ పడిగెల మానస, డాక్టర్లు స్రవంతి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల గుడికి భూమిపూజ

తంగళ్లపల్లి: మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని రాముల బండ శ్రీ సీతారామచంద్ర స్వామికి నూతన ఆలయం నిర్మాణానికి గురువారం ఉదయం 9 గంటలకు భూమిపూజ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మాట్ల మధు తెలిపారు. గ్రామ ప్రజలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, అన్ని కుల సంఘాల నాయకులు, మహిళలు, రైతులు, మండల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి సీతారాముని కృపకు పాత్రులు కావాలని కోరారు.

చందుర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా పి.లీలారాణి



చందుర్తి: చందుర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా పి.లీలారాణి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ గోపాల్ సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో వేములవాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న లీలారాణి చందుర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు..

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏడుగురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ మాలోతు భూల లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో తఫజుల్ హుస్సేన్, ఎంపీటీసీలు అరుణ్‌కుమార్, పంభాల రేణుక, ఎంపీడీవో నరేశ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..

వీర్నపల్లి: మండల కేంద్రంలో లబ్దిదారు దేశరాజు సత్తయ్యకు మంజూరైన రూ.11 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ పాటి దినకర్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కముటం నాగరాజు బుధవారం అందజేశారు.

అంతర్‌రాష్ట్ర క్రికెట్‌లో ప్రతిభ


వర్షితకు అభినందిస్తున్న హెచ్‌ఎం భాగ్యరేఖ

సిరిసిల్లటౌన్: స్థానిక జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థిని అన్నల్‌దాస్ వనిత రాష్ట్రస్థాయి క్రికెట్‌లో ప్రతిభ చాటింది. ఇటీవల తమిళనాడులో జరిగిన సౌత్ ఇండియన్ మినీ సబ్ జూనియర్ సాఫ్ట్ క్రికెట్ చాంపియన్ షిప్–2023లో రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. హెచ్‌ఎం భాగ్యరేఖ, ఉపాధ్యాయులు ఎలగొండ రవి, ఎస్‌ఎంసి చైర్మన్ శ్రీధర్, రూపిక, ఉపాధ్యాయులు అభినందించారు.

వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలోని వసతి గృహాలకు పక్కా భవనాలను నిర్మించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ అన్నారు. బీసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హాస్టళ్ల సందర్శనలో భాగంగా బుధవారం సిరిసిల్లలో బీసీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.

సెలవులు హరించే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి దేవసేన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వుత్తం విజయ్‌కుమార్, మిట్టపల్లి ప్రశాంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడాన్ని మరో రౌలత్ చట్టం గుర్తుకొచ్చేలా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సెలవులు పెట్టి వచ్చి తమ హక్కుల కోసం ధర్నాలు, పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. సెలవులు అనేవి ఉపాధ్యాయుల హక్కు అని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం సెలవులు వాడుకుంటామని, దీనిని వద్దనే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు. సెలవులు ఇవ్వద్దనే ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ విద్యా సంస్థల్లో ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: రానున్న విద్యాసంవత్సరానికి జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బీపీసీ, ఎంఎల్‌టీ, డెయిరీ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరచాలన్నారు. తీతీత్వీ.ఝుట్బుజీట్బ్ఱ ్ఞ ఽఱ్చ.జౌ్ౖ.జీ ఽ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 6, 7, 8 తరగతుల తోపాటు ఇంటర్మీడియెట్ సెకండియర్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రం, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 30లోపు దరఖాస్తు చేయాలని చెప్పారు. వివరాలకు 73311 17865లో సంప్రదించాలని సూచించారు.

నాటుసారా కేసులో ఏడాది జైలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లికి చెందిన దండుగుల ఉషయ్యకు నాటుసారా కేసులో ఏడాది జైలుశిక్ష విధించినట్లు వేములవాడ ఎక్సైజ్ సీఐ రాములు తెలిపారు. ఉషయ్య గతంలో సారా కేసులో నిందితుడిగా ఉండి, బైండోవర్ అయినప్పటికీ మార్పు రాలేదన్నారు. సారా విక్రయిస్తుండగా పట్టుకుని తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.లక్ష జరిమానా విధించారు. ఆ జరిమానాను నిందితుడు చెల్లించనందున చట్టప్రకారం ఏడాది జైలు శిక్ష విధిస్తూ వేములవాడ తహసీల్దార్ రాజు నిర్ణయం తీసుకున్నారు. ఉషయ్యను కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో జీవాలు మృతి

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్‌లో గొర్రెలమందపై కుక్కలు దాడి చేయగా 12 జీవాలు మృతిచెందాయి. ఈ సంఘటనలో ముగ్గురు గొర్రెల కాపరులకు రూ.60వేల వరకు నష్టం ఏర్పడింది. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన కేశవేని ఎల్లయ్య, ప్యాట్ల ఎల్లయ్య, దయ్యాల మల్లయ్యలు గొర్రెలను మేపేందుకు అల్మాస్‌పూర్ శివారు ప్రాంతానికి బుధవారం తీసుకొచ్చారు. గొర్రెలమంద ఒక చోట మేస్తుండగా.. ఒక్కసారిగా కుక్కలు దాడిచేశాయి. దీంతో 12 జీవాలు అక్కడికక్కడే మృతిచెందగా.. మరికొన్ని గాయపడ్డాయి.

మైనర్ బాలిక అదృశ్యం

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్యమైంది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. గొల్లపల్లికి చెందిన బాలిక తొమ్మిదో తరగతి వరకు చదువుకుంది. ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే మానేయగా, స్థానికంగా ఓ సూపర్ మార్కెట్లో పనిచేస్తోంది. ఈనెల 23న రోజు మాదిరిగానే సూపర్‌మార్కెట్‌లో పని ముగించుకుని సాయంత్రం ఇంటికొచ్చింది. స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. రెండు రోజులుగా తల్లి గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.